క్లుప్తంగా

నేడు విజయ ఫార్మసీలో మహిళా లీగ్-2023 పోటీలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజయ మహిళా ఫార్మసీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో మహిళా లీగ్ -2023 పోటీలు ఫైనల్స్‌ను (మహిళ అధ్యాపకులకు) మంగళవారం నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, ఏపీటీఐ ఉమెన్స్ ఫోరం కన్వీనర్ కె.పద్మలత తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 130 కళాశాలల నుంచి మహిళా అధ్యాపకులు పాల్గొంటారని వివరించారు. టీచింగ్, సైంటిఫిక్, కల్చరల్ విభాగాల్లో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 8 జోన్లలో జోనల్ లెవల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జోనల్ లెవల్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా అధ్యాపకులకు మంగళవారం ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

విజయవాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: తన ఇంటి సరిహద్దులో వుండే దాసరి దుర్గారావు అనే వ్యక్తి ఇంట్లో వాడుకున్న నీటిని తన స్థలంలోకి వదులుతున్నాడని, స్థలం సర్వే చేయించాలని కోరితే అవహేళన చేసి మాట్లాడుతూ కొట్టేందుకు వస్తున్నాడని, అధికారులు తనకు న్యాయం చేయాలని పి.నైనవరం గ్రామానికి చెందిన దర్శి వెంకటేశ్వరావు అనే వృద్ధుడు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దారు పి.జాహ్నవి, ఎంపీడీఓ బి.భార్గవి, గృహ నిర్మాణ శాఖ డీఈ నాగమల్లేశ్వరరావు, డీటీ ప్రవీణ్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత



రామవరప్పాడు: రామవరప్పాడు సాయినగర్‌కు చెందిన మానసిక దివ్యాంగురాలికి వైఎస్ఆర్ చారిటీస్ అధ్యక్షుడు, దాత యలమంచిలి జయప్రకాష్ సోమవారం వీల్‌చైర్‌ను అందజేశారు. గ్రామానికి చెందిన యండ్ర కృష్ణ కుమార్తె పద్మకు మెదడు ఎదుగుదల లేకపోవడంతో నడవటం కష్టతరంగా మారింది. వీరి పరిస్థితి తెలుసుకున్న జయప్రకాష్ వెంటనే స్పందించి వీల్‌చైర్‌ను అందించారు. జయప్రకాష్ మాట్లాడుతూ వైఎస్ఆర్ చారిటీస్ ఆధ్వర్యంలో గన్నవరం, పెనమలూరు, తూర్పు నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలను విస్తృతపరుస్తున్నట్లు తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి నిమిత్తం తోపుడుబండ్లు, ఇస్త్రీ బండ్లు, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, ఎంపీటీసీ సమ్మెట లక్ష్మి పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: మండలంలోని యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో సోమవరం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివార్లకు ఉదయం ప్రత్యేకాభిషేకం, అనంతరం విశేష అలంకరణ చేశారు. అమ్మవారికి భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు.

బ్రహ్మోత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో రెండు రోజులుగా జరుగుతున్న శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు కుటుంబ సభ్యులతో అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం నిత్యార్చన, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకం, చెరువు సెంటర్లో రాయబారం నిర్వహించిన పిమ్మట సాయంత్రం దేవాలయం వద్ద దివ్యకల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో వచ్చి శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే సార్థకత

హనుమాన్‌జంక్షన్ రూరల్: క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోగలమని హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ వాసా వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో 'విద్యార్థుల క్రమశిక్షణ – పాఠశాల పాత్ర' అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటనాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నున్నలో శరవేగంగా అభివృద్ధి పనులు

మూడున్నరేళ్లలో సుమారు రూ.10 కోట్ల అభివృద్ధి పనులు



నున్న గ్రామంలో ప్రారంభానికి సిద్ధమవుతున్న గ్రామ సచివాలయ కార్యాలయం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ ఏర్పడిన 50 ఏళ్ల కాలంలో ముందెన్నడూ జరగని విధంగా ప్రస్తుతం గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో గ్రామంలో రోడ్లు, డ్రైన్లు, సచివాలయ భవనాలు, ఆర్‌బీకే సెంటర్, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు, రెండు ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చొరవతో పంచాయతీ నిధులు, మండల పరిషత్ నిధులు, జీజీఎం గ్రాంటుతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గ్రామంలో దీర్ఘకాలంగా వున్న తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. రూ.1.40 కోట్లతో రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల రెండు ట్యాంక్‌లు నిర్మించారు. రాబోయే 20 ఏళ్లకు సరిపడా అంచనాతో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం జరుపుతున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ దయానంద్ తెలిపారు. అనంతరం జలజీవన్ మిషన్ గ్రాంటు కింద గ్రామానికి రూ.3.20 కోట్లు మంజూరు కాగా వాటిలో రూ.1.10 కోట్లతో 40వేల లీటర్ల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, పైపులైను నిర్మాణం పనులు తుది దశలో వున్నాయి. వీటితో పాటు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న విశ్వబ్రాహ్మణ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్, ప్రధాన గ్రామంలో మరో ట్యాంక్ నిర్మాణానికి స్థల సేకరణ జరిగింది. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందజేస్తున్నారు. రూ.80 లక్షలతో రెండు సచివాలయ భవనాలు మంజూరయ్యాయి. వీటిలో ఒకటి పూర్తి కాగా, మరొకటి ప్రారంభానికి సిద్ధమవుతోంది. రూ.43.60 లక్షలతో రెండు రైతు భరోసా కేంద్రాలు మంజూరు కాగా ఒకటి పూర్తి అయింది. రెండవది నిర్మాణంలో ఉంది. రూ.35 లక్షలతో రెండు వైఎస్సార్ హెల్త్‌సెంటర్ల భవనాలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.35 లక్షలతో అంతర్గత రోడ్ల నిర్మాణం, మండల పరిషత్ నిధులు రూ.22.50 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇవి కాక జిల్లాపరిషత్‌లో నాడు నేడు నిధులు రెండవ ఫేజ్‌లో రూ.2.28 కోట్లతో 14 అదనపు తరగతి గదుల నిర్మాణం జరుగుతుండగా, మొదటి ఫేజ్‌లో రూ.50 లక్షలతో మౌలిక సదుపాయాలను కల్పించడం లాంటి అభివృద్ధి పనులు జరిగాయి.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



భవిష్యత్ లో గ్రామస్తులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికతో పనులు జరుగుతున్నాయి.మైక్రో ఫిల్టర్లు ఏర్పాటు చేసి శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదనలున్నాయి.

–గ్రామ సర్పంచ్ కాటూరి సరళశ్రీనివాస్

పారిశుద్ధ్య పనుల టెండరు ఆమోదం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ వరి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ముందుగా అజెండాలోని అంశాలను పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు పాలకవర్గ సభ్యులకు చదివి వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో 2023–24 సంవత్సరానికి ఏజెన్సీ పద్ధతిలో పారిశుధ్య పనులు, వాటర్ వర్కులు, విద్యుత్ పనులకు సంబంధించి తక్కువ రేటుకు దాఖలు చేసిన టెండరును ఆమోదించారు. పంచాయతీ కార్యాలయం మరమ్మతుల నిమిత్తం తాత్కాలికంగా కార్యాలయాన్ని మరొక అద్దె భవనానికి మార్చే అంశాన్ని ప్రసావించారు. కాలువగట్టు ప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మాణానికి పాలకవర్గ సమావేశంలో చర్చించారు. గ్రామంలో అపార్టుమెంట్లు, గ్రూపు హౌస్‌ల నిర్మాణం జరిగే ప్రాంతాల్లో డ్రెయిన్ల అభివృద్ధిని సంబంధిత బిల్డర్లకు అప్పగించే ఆలోచన చేయాలని పలువురు వార్డు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మర్లపాలెం వద్ద రైల్వే ఫ్లై ఓవర్ పనులు ప్రారంభం



మర్లపాలెం వద్ద పిల్లర్లపై ఏర్పాటు చేస్తున్న గడ్డర్లు

గన్నవరం: మండలంలోని చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు నిర్మిస్తున్న ఎన్‌హెచ్–16 జాతీయ రహదారి బైపాస్ నిర్మాణంలో కీలకమైన మర్లపాలెం వద్ద రైల్వే ఫ్లైఓవర్ పనులు ప్రారంభమయ్యాయి. హౌరా–చెన్నై రైల్వే మార్గంపై ఫ్లైఓవర్ నిర్మాణం కోసం గతంలోనే రైల్వేట్రాక్‌కు ఇరువైపులా పిల్లర్ల నిర్మాణం చేశారు. ఈ పిల్లర్లపై ఐరన్ గడ్డర్ల ఏర్పాటు ద్వారా రోడ్డు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. విజయవాడ నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు 30 కిలోమీటర్ల పొడవునా ఆరు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 75 శాతం బైపాస్ నిర్మాణం పూర్తికాగా, కీలకమైన మర్లపాలెం, గొల్లపూడి సమీపంలో రైల్వేట్రాక్‌లపై ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను మెగా ఇంజినీరింగ్ సంస్థ ప్రారంభించింది. విద్యుద్దీకరణ కలిగిన ఈ ట్రాక్‌పై ఫ్లైఓవర్ల నిర్మాణానికి రైల్వేశాఖ నుంచి అనుమతులు రావడంతో పనులను వేగవంతం చేస్తున్నారు. మర్లపాలెం రైల్వేట్రాక్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం ట్రాక్‌కు ఇరువైపులా రెండు వరుసలుగా నాలుగు పిల్లర్లను నిర్మించారు. ప్రస్తుతం ఈ పిల్లర్లపై భారీ క్రేనులతో ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ గడ్డర్ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తిచేసి రోడ్డు నిర్మాణం చేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ, రైల్వే శాఖ అధికారులు, మెగా ఇంజనీరింగ్ సంస్థ సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి



సీతమ్మ మృతదేహం

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనపై కంకిపాడు పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ సుధాకర్ కథనం మేరకు... ఈ నెల నాలుగో తేదీన విజయవాడ సింగ్‌నగర్‌కు చెందిన మాలపాటి సీతమ్మ (47) పాయకాపురానికి చెందిన గొట్టిపాటి దుర్గాప్రసాద్ ద్విచక్రవాహనంపై నెప్పల్లి గ్రామం నుంచి విజయవాడ వైపు వెళ్తున్నారు. వారి వాహనం గోశాల సెంటరుకు చేరుతున్న క్రమంలో కంకిపాడు నుంచి విజయవాడ వైపు వస్తున్న కారు వెనుక నుంచి వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై నుంచి సీతమ్మ, దుర్గాప్రసాద్ కింద పడ్డారు. సీతమ్మ తలకు బలమైన గాయాలుకావడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందింది. ఆస్పత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఇంటి వద్దే వైద్య సేవలు



నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది నున్న గ్రామంలో ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలను అందజేశారు. సోమవారం బోడపాడు, సుగాలీ కాలనీల్లో గర్భిణులు సాయిప్రసన్న, గాయత్రి, అనూష, నాగమణి(బాలింత) వద్దకు వెళ్లిన వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు చేసి పౌష్టికాహారం తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో పురుడు పోసుకోవడం వలన ప్రభుత్వం కల్పించే వైద్య సదుపాయాలను వారికి వివరించారు. బాలింతలు తప్పనిసరిగా బిడ్డకు తల్లి పాలే తాగించాలని సూచించారు. శుభ్రమైన దుస్తులను వాడటం వలన పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. ఏఎన్ఎం కైలా రజిని, ఎంఎల్‌హెచ్‌పీ రమ్యశ్రీ, ఆశ వర్కర్లు సత్యవతి, జ్యోత్స్న వైద్య సేవలందించిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం



మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది విధిగా పూర్తి సమాచారంతో హాజరు కావాలని తాడిగడప మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు ఆదేశించారు. ఆయన సోమవారం తాడిగడపలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. తాడిగడప సచివాలయం–2 పరిధిలో మంగళవారం నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొంటారని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆదేశించారు. గ్రామంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులకు బ్రోచర్లు అందచేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారికి పూర్తి వివరాలతో కారణాలు కూడా తెలుపుతామని పేర్కొన్నారు.

ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలతో నిఘా

హనుమాన్‌జంక్షన్ రూరల్: నేరాలను అదుపు చేసేందుకు, నేరస్తులను సులువుగా పట్టుకునేందుకు వీలుగా హనుమాన్‌జంక్షన్‌లో పలు ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లుగా సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ పూర్తిగా మరమ్మతులకు గురి కావటంతో దాతల సహకారంతో మళ్లీ వీటిని వినియోగంలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా చెప్పారు. ఇప్పటికే ఎంపిక చేసిన 32 ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని, పోలీస్ స్టేషన్‌లో నిరంతరం ఈ సీసీ కెమెరాల పుటేజ్‌ను పరిశీలించేందుకు కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని సీఐ వివరించారు. త్వరలోనే జంక్షన్ మెయిన్ సెంటర్‌తో పాటుగా రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయనున్నట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వాసా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తేలప్రోలు-1 సెగ్మెంట్ ఎంపీటీసీ ఎన్నిక డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్లు

ఉంగుటూరు: తేలప్రోలు–1 సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుల ఎన్నిక కోసం డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్‌ల వివరాలను ఎంపీడీవో శేషగిరిరావు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో ఆర్‌సీఎం స్కూల్, పార్శన్ పేట ఎంపీపీ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ భవనాలను ఎంపిక చేసి జాబితాను ప్రదర్శనగా ఉంచామన్నారు. అభ్యంతరాలు స్వీకరించి ఈ నెల10న తుది పోలింగ్ స్టేషన్‌ల జాబితాను మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రదర్శనగా ఉంచనున్నట్లు వివరించారు.

నేడు రాజకీయ పార్టీ నాయకుల సమావేశం

తేలప్రోలు–1 సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలో భాగంగా మంగళవారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు, స్థానిక కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరు కావాలని కోరారు.

నేడు పెదపులిపాక ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: మండలంలోని పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయరాజరాజేశ్వరి, శ్రీ విజయసుందరేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. ఫాల్గుణ మాస పూర్ణిమ సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు విజయలక్ష్మి అమ్మవారికి కలశాభిషేకం జరుగుతుంది. అనంతరం అమ్మవారికి వెండి నాణాలతో అర్చన చేస్తారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీలలితా సహస్రనామపారాయణం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని గోత్రనామాలతో పూజలు చేయించుకోవాలని ఆలయ కమిటీ సూచించింది.

వైభవంగా వార్షిక కల్యాణోత్సవం

కంకిపాడు: మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో వేంచేసిన శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు అర్చకులు సంప్రదాయ బద్ధంగా కల్యాణాన్ని జరిపించారు. ప్రొద్దుటూరు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు దంపత సమేతంగా పీటలపై కూర్చుని స్వామివారికి పూజలు చేయించారు. వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గ్రామవీధుల్లో ఘనంగా ఊరేగించారు. భక్తులు స్వామివారికి పసుపు, కుంకుమలు సమర్పించి పూజలు చేయించారు. ఉత్సవాన్ని అర్చకులు గూడూరు శ్రీనివాసప్రసాదశర్మ, మహిధర్ పర్యవేక్షించారు.

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

పెనమలూరు: కోడిపందేలు ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు కథనం మేరకు.. పెదపులిపాక గ్రామ పరిధిని ప్లాట్‌లలో కోడి పందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేసి, వారి వద్ద 9 బైక్‌లు, ఆరు సెల్‌ఫోన్‌లు, రెండు పుంజులు, రెండు కత్తులు, రూ.2700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు తిరుపతమ్మ తిరనాళ్లు

పెనమలూరు: మండలంలోని కానూరులో మంగళవారం తిరుపతమ్మ తిరునాళ్లు జరగనున్నాయి. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామివార్ల దేవస్థానంలో ఉదయం ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం గ్రామోత్సవం జరుగుతుంది. భక్తుల కోసం ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలూ కల్పించింది. మొక్కులు ఉన్న భక్తులు బోనాలు అమ్మారికి చెల్లిస్తారు. రాత్రికి గ్రామంలో ప్రభోత్సవం జరుతుంది.

రైతులకు చేరువగా సహకార సేవలు



రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: ప్రాథమిక సహకార సొసైటీలను రైతులకు మరింత చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పెద ఓగిరాల పీఏసీఎస్ పరిధిలో నలుగురు రైతులకు సోమవారం రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులు మరణిస్తే మట్టి ఖర్చులు కింద సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్ బొమ్ము లక్ష్మారెడ్డి, కార్యదర్శి గుంటక మధుకుమార్‌రెడ్డి, ఉయ్యూరు బ్రాంచ్ మేనేజర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల పరీక్ష కేంద్రం మార్పు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థుల పరీక్ష కేంద్రాన్ని స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్‌లో కేటాయిస్తూ కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. తొలుత కళాశాల డిగ్రీ విద్యార్థులకు పరీక్ష కేంద్రాన్ని విజయవాడలో కేటాయించారు. కళాశాలకు చెందిన 500 మంది డిగ్రీ విద్యార్థులు పరీక్షల కోసం విజయవాడ వెళ్లిరావడం దూరాభారం కావడంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. విశ్వవిద్యాలయ అధికారులతో ఎమ్మెల్యే చర్చించడంతో పరీక్ష కేంద్రాన్ని మార్పు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ మోహన్‌కు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

78 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు



వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తమాలిక్ ఆఫీసర్ రాజేష్‌కుమార్

కంకిపాడు: కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి పరిష్కరించుకోవాలని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తమాలిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్ కుమార్ సూచించారు. మండలంలోని కుందేరు ఎస్‌సీ కాలనీలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 78 మంది వృద్ధులకు రాజేష్‌కుమార్ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది బేబీ, మోహన రూప, సిపోరి పాల్గొన్నారు.

కరాటేలో ముగ్గురు చిన్నారులకు పతకాలు



కరాటేలో పతకాలు సాధించిన చిన్నారులు

పెనమలూరు: కరాటే పోటీల్లో ముగ్గురు చిన్నారులు పతకాలు సాధించారు. యనమలకుదురుకు చెందిన వాన్‌కాన్ కరాటే డో ఫెడరేషన్ చీఫ్, కరాటే కోచ్ ఎస్. దుర్గారావు సోమవారం ఈ వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం హన్మకొండలో ఈ నెల ఐదో తేదీన జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో దుర్గారావు వద్ద కోచింగ్ తీసుకున్న ఎస్.రుత్విక్ నాలుగేళ్ల విభాగంలో, 13 ఏళ్ల విభాగంలో కె.ధీరజ్, 14 ఏళ్ల విభాగంలో కె.బాలరుషి బంగారు పతకాలు సాధించారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



కబడ్డీ ఆడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కంకిపాడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహంగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, స్పీడ్ వాల్, రన్నింగ్ రేస్ మొదలైన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిధిలోని కంకిపాడు, పెనమలూరు, విజయవాడ రూరల్ మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ బేబీ సుకన్య, సూపర్‌వైజర్లు సత్యవాణి, స్వర్ణకుమారి, రమానాగమణి, విజయ పర్యవేక్షించారు. విజేతలకు ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతి ప్రదానం చేస్తామని సీడీపీఓ బేబీ సుకన్య తెలిపారు.

వైభవంగా బూసిమ్మ తల్లి తిరునాళ్లు



అమ్మవారికి తొలిబోనం సమర్పించేందుకు ఊరేగింపుగా వెళ్తున్న సర్పంచ్ నాగలక్ష్మి దంపతులు

ఉయ్యూరు: మండలంలోని ముదునూరు గ్రామంలో వేంచేసి ఉన్న బూసిమ్మతల్లి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల రెండో తేదీన ప్రారంభమైన తిరునాళ్లు 15 రోజులు పాటు కొనసాగుతాయి. కూరాకుల వంశస్తులతో పాటుగ్రామస్తులు, పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఉత్సవాల్లో సంప్రదాయం ప్రకారం గ్రామ సర్పంచ్ మొవ్వ వెంకట నాగలక్ష్మి, జ్ఞానశేఖర్ దంపతులు సోమవారం తొలి గ్రామ బోనం సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీన పల్లపోతు భగవాన్ దాసుచే శిడిబండి ఉత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.